

## సూర్యోదయం తెలీదు..సూర్యాస్తమయం చూడలేరు

### ప్రతీ ఒక్కరి తరపున గళం విప్పి కలం పట్టి

### కదం తొక్కే కార్మికుడే జర్నలిస్ట్



STV SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

గొర్రె తోక జీతానికి గాడిద చాకిరీ చేసే జర్నలిస్టుల జీవితాలు చూస్తే కడుపు తరుక్కుపోతుంది. విలేకరి, రిపోర్టర్, పాత్రికేయుడు, కరెస్పాండెంట్- పేర్లు ఏవైనా చుట్టూరా ఉన్న సమాజంతో మమేకం అయ్యి జీవితాలు గడిపేసే వారు అక్షర కార్మికులే. మురికివాడల్లో పేదల గుడిసెలు అక్రమంగా కూల్చేస్తే కన్నీటి పర్యంతం అవుతాడు జర్నలిస్టు. ఆ కన్నీటితోనే నిప్పులు


# ఉగాదులుండవ్... ఉషస్సులుండవ్

చెరుగుతాడు. అక్రమార్కుల గుట్టు విప్పి వారి తప్పులు ఎండగడతాడు. ఎక్కడో ఓ పరిశ్రమ అన్యాయంగా మూతపడితే.. కార్మికులు రోడ్డున పడితే..అదేదో తానే పస్తులు ఉన్నట్లు నక నకలాడతాడు. యాజమాన్యాల తప్పిదాలను ఎత్తి చూపుతాడు. శ్రమైక సుందర జీవితాలు గడిపే కార్మికుల తరపున వకాల్తా పుచ్చుకుని పోరాటాలూ చేస్తాడు. పేదలకు పెత్తందార్లకు మధ్య పేచీ వస్తే పేదల పక్షమే వహిస్తాడు. ప్రజల అవసరాలు తెలుసుకుని మంచిగా పాలన చేసే ప్రజాప్రతినిథుల మంచిని వేనోళ్ల పొగుడుతాడు. అది లోకానికంతటికీ తెలియజేస్తాడు. కొందరు ప్రజాప్రతినిథులు అడ్డదారిలో అక్రమాలతో ప్రజలను వేధిస్తే.. వారి దుర్మార్గాలను చీల్చి చెండాడేస్తాడు. తాము చేసిన మంచి గురించి జర్నలిస్టులు మంచి వార్తలు ఇచ్చినపుడు మౌనంగా దాన్ని ఆనందించే పెద్దలే తమ తప్పులను అక్షరాలతో ఎత్తి చూపితే మాత్రం.. జర్నలిస్టులపై కక్షగట్టేస్తారు. అతనికో చిన్న పత్రిక ఉంటే దానకి లైసెన్స్ ఉందా? రిజిస్ట్రేషన్ అయ్యిందా? అంటూ టెర్రరిస్టుల కన్నా దారుణంగా పాత్రికేయులపై మండి పడతారు.ఈ పత్రికలే తమ గురించి మంచి రాస్తే ఆ పత్రికకు లైసెన్స్ ఉందా లేదా అన్న ఆచూకీ కూడా చేయరు. అన్ని వ్యవస్థల్లో ఉన్నట్లే రాజకీయ నాయకుల్లో మంచి వారూ ఉంటారు.. అడ్డదారిలో నడిచే వారూ ఉంటారు. ఎక్కువ మంది మంచి వారే ఉంటారు. జర్నలిజం దీనికి మినహాయింపేమీ కాదు. వందమందిలో పది మంది తప్పుడు దారిలో జర్నలిస్టులు కూడా ఉండచ్చు.

జర్నలిస్టులు చేసే చాకిరీ ఎక్కువ . పొందే జీతం తక్కువ. అయినా ఏ నాడూ ఏ జర్నలిస్టూ దాని గురించి బాధపడడు. తాము రాసే మంచి వార్తలను ఎవరైనా మెచ్చుకుంటే చాలు పొంగిపోతారు. దాంతోనే వారి ఆకలి తీరిపోతుంది. అంతకు మించి అత్యాశలు ఉండవు. నూటికి 90 మంది జర్నలిస్టులకు కుటుంబాలు ఉండవా. పండగలు ఉండవా. ఇళ్లల్లో శుభకార్యాలు ఉండవా. ఏవి ఉన్నా ఎక్కడో ఒక చోట ఏదో ఒక ఘటన జరిగితే అమాంతం జర్నలిస్టు అక్కడ వాలాల్సిందే. ఏ నేర ఘటనో జరిగితే ముందుగా అక్కడ ఉండేది జర్నలిస్టు.. పోలీసులే. సెలవు రోజు అయినా సరే ఏదైనా అనుకోని ఘటన జరిగితే ఆఫీసు నుండి ఫోను రావలసిన అవసరం కూడా లేదు జర్నలిస్టు అమాంతం డ్యూటీలో దిగిపోవలసిందే.




రాజకీయ నేతల సభలు సమావేశాలు, పాలకుల ప్రారంభోత్సవాలు, సమీక్షలు, పారిశ్రామిక వేత్తల శిక్షణా తరగతులు, ప్రమోషన్లు, కార్మికుల ఆందోళనలు, బడుగు బలహీన వర్గాల నిరసనలు, ఎర్ర జెండా కోపాలు, రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటకు గిట్టుబాటు దొరక్క రైతన్న పురుగు మందు తాగితే..పాలకులు పట్టించుకోవడం లేదని ఏ చెట్టుకో ఉరేసుకుంటే... ఏ బ్యాంకు సిబ్బందో రైతు తీసుకున్న రుణానికి కిస్తీ కట్టలేదని నాగలి జప్తు చేసి పట్టుకుపోతే...గుండెల నిండా కళ్లు చేసుకుని ఆ వార్తలను కవర్ చేసేది జర్నలిస్టే. చాలీ చాలని జీతాలు.. ఆకలి తీరని కడుపులు... గుండెల నిండా అసంతృప్త భావనలు ఉన్నా అన్నింటినీ పంటి బిగువున దిగమింగుకుని



మొత్తం ప్రపంచాన్ని తానే నడుపుతున్నానని పిచ్చిగా నమ్మే వెర్రి మొర్రి అమాయకులు జర్నలిస్టులే. ఓ కాళ రాత్రి వేళ రోజంతా డ్యూటీ చేసి ఇంటికి చేరిన జర్నలిస్టుకి.. లుంబినీ పార్కులో పేలుడు ఘటన తెలిసింది. అన్నం తింటోన్న కంచాన్ని పక్కన పెట్టేసి అమాంతం స్పాట్ కి వెళ్లిపోయాడు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అర్ధరాత్రి రసాయినాలు వికటించి బాయిలర్ పేలింది. గాఢనిద్రలో ఉన్న జర్నలిస్టు ఫోనుకి మెసేజ్ వచ్చింది. దుప్పటి పక్కన పడేసి బట్టలు వేసుకుని యుద్ధభూమిలోకి దూకే సైనికుడిలా వెళ్లిపోయారు జర్నలిస్టులు. పిల్లల పుట్టిన రోజు పండగలు, బంధువుల పెళ్లిళ్లు.. చుట్టాలు పక్కాలతో సరదాగా మాట్లాడుకోవడాలు. .కలుసుకోవడా లు.. అన్నీ కూడా జర్నలిస్టులకు లక్జరీలే. అవి అందమైన కలలుగానే మిగిలిపోతున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు తమకు డిఏ రాలేదంటే.. జీతాలు పెంచలేదంటే.. ఏ ప్రైవేటు కంపెనీ అయినా ఏళ్ల తరబడి కార్మికులు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించలేదంటే..వారికి నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన జీతాలు ఇవ్వడం లేదని రోడ్డెక్కితే.. వారి తరపున కలాన్నే ఆయుధంగా చేసుకుని పోరాడేది సీరియల్ వార్తా కథనాలతో వ్యవస్థలపై ఒత్తడి తెచ్చి వారికి న్యాయం చేసేది జర్నలిస్టులే. కానీ తమ జీతాల కోసం ఏ నాడైనా జర్నలిస్టులు ఆందోళనలు చేశారా? మా పోరాటానికి మద్దతు తెలపండని ఎవరినైనా అడిగారా? ఎవరూ పిలవకపోయినా పొద్దున్నే సూర్యుడు ఉదయి స్తాడు. సాయంత్రం కాగానే సూర్యుణ్ని ఇంటికి పంపి చంద్రుడు వస్తాడు. నీలాల ఆకాశమంతా నక్షత్రాలు రక్షక భటుల్లా కాపలా కాస్తాయి.అలానే జర్నలిస్టులూ. ఎక్క డైనా ఓ అగ్ని ప్రమాదం జరిగితే.. భారీ రోడ్డు ప్రమాదం జరిగితే.. ఎవరూ పిలవక్కర్లేదు. యంత్రంలా అక్కడికి బాధ్యతగా వెళ్లిపోతాడు జర్నలిస్టు. ఎంత శ్రమించినా కష్టానికి సరిపడ ఫలం అందకున్నా తన బాధ్యతను ఏ నాడూ మర్చిపోడు. అటువంటి జర్నలిస్టులపై కొందరు నేతలు ఉట్టి పుణ్యానికి నోరు పారేసుకుంటున్నారు. అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం అని కూడా నిలదీయలేని వెర్రి మంచితనం ఒక్క జర్నలిస్టులకే ఉంటుందేమో.



అనిల్ కుమార్ కుంట....
SANDESH PLUS
93933 44405

